సాక్షి
నిజామాబాద్
గురువారం । 2 । జనవరి । 2025



‘వరద’ పోతోంది!

ఎస్సారెస్పీ నుంచి వరద కాలువకు నీటి కేటాయింపులు లేకున్నా మంగళవారం నుంచి నీటి విడుదలను ప్రారంభించారు.

- 8లో ▸



విద్యాశాఖలో కదలని ఫైళ్లు!

విద్యాశాఖలో రెండు నెలలుగా ఫైళ్లు కదలడం లేదు. డీఈవో అశోక్, అసిస్టెంట్ డైరెక్టర్ నాగజ్యోతి మధ్య వివాదం నెలకొంది.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.9 /17.1

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రిని కలిసిన పోచారం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

నేడు ఏకసభ్య కమిషన్ రాక


నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ ఉపవర్గీకరణ, వివరణాత్మక అధ్యయనం కోసం గురువారం ఉదయం 11 గంటలకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి(కలెక్టరేట్)రానుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన వారు హాజరై, తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్‌తో కూడిన ఏక సభ్య కమిషన్ కు దరఖాస్తులు అందజేయొచ్చని సూచించారు. ఎస్సీ కులానికి చెందిన ప్రజాప్రతినిధులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వైద్యులు, షెడ్యూల్డ్ కుల సంఘాల నాయకులు, ఇతర ఉద్యోగులు, ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ కులానికి చెందిన అన్ని వర్గాల వారు హాజరై ఏకసభ్య కమిషన్‌కు తమ తమ వినతులు అందజేయాలని పేర్కొన్నారు.

చిరుత జాడ కోసం కెమెరాల ఏర్పాటు



నందిపేట్(ఆర్మూర్): చిరుత పులి జాడ కనిపెట్టేందుకు మండలంలోని సీహెచ్ కొండూర్ గ్రామ శివారులోని అటవీప్రాంతంలో అటవీశాఖ అధికారులు బుధవారం అధునాతన కెమెరాలను ఏర్పాటు చేశారు. పది రోజుల క్రితం మాయాపూర్ సమీపంలో పులి సంచరిస్తోందని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అటవీశాఖ అధికారులు పాదముద్రలను సేకరించి అది చిరుత కాదని అడవిపిల్లి అని నిర్ధారించారు. ఆ తరువాత మూడు రోజులకు సీహెచ్ కొండూర్ గ్రామానికి చెందిన మేకల కాపరి తన కొడుకుతో కలిసి అడవిలో మేకలను మేపి ఇంటికి తిరిగి వస్తుండగా ఓ మేకపై చిరుత దాడి చేసిందని మరోసారి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో అటవీశాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించి మేకల కాపరితో మాట్లాడి వివరాలు సేకరించారు. వెంటనే ఉమ్మెడ అటవీ ప్రాంతంలో, బుధవారం సీహెచ్ కొండూర్ శివారులోని అటవీ ప్రాంతంలో అధునాతన కెమెరాలను ఏర్పాటు చేశారు. అటవీప్రాంతం వైపు ఒంటరిగి వెళ్లొద్దని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ సూచించారు.

స్థానిక ఉత్కంఠ



తటస్థులు సైతం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న వారికి హైదరాబాద్ నుంచి పలు సర్వే సంస్థలు ఫోన్లు చేస్తున్నాయి. స్థానిక సంస్థల్లో మహిళలకు సగభాగం సీట్లు కేటాయించనుండడంతో వారికి సైతం సర్వే సంస్థల నుంచి ఫోన్లు వస్తున్నాయి. తటస్థులు సైతం స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు పోటీ పడుతుండడంతో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఆర్మూర్, బోధన్, భీంగల్ పీఠాలను కోరు కుంటున్న వారిలో కీలకమైన, గౌరవప్రదమైన వృత్తుల్లో ఉన్నవారు, తటస్థులు సైతం ఉన్నారు. ఇలాంటి వారిలోనూ వచ్చే రిజర్వేషన్ల విషయంలో ఉత్కంఠ నెలకొంది.

- పరిషత్, పంచాయతీ పదవుల ఆశావహుల్లో రిజర్వేషన్ల టెన్షన్
- ఈ నెల 25న ముగియనున్న నగరపాలక, మున్సిపల్ పాలకవర్గాల కాలపరిమితి
- ఫిబ్రవరిలో సహకార సంఘాల పాలకవర్గాలు..
- గ్రామాల్లో, పట్టణాల్లో మరోసారి ఎన్నికల సందడి
- పలువురు ఆశావహులకు సర్వే సంస్థల నుంచి ఫోన్లు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: 2025 ఏడాది ప్రారంభంలో స్థానిక సంస్థలు, సహకార సంఘాల ఎన్నికలు జరుగనుండడంతో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఇప్పటికే లెక్కలు వేసుకునే పనిలో పడ్డారు. 2024 ఫిబ్రవరి 1తో గ్రామ పంచాయతీల పాలకవర్గాల కాలపరిమితి ముగిసింది. గత జూలై 4న మండల ప్రజా పరిషత్‌లు, గత జూలై 5న జిల్లా ప్రజాపరిషత్‌ల కాలపరిమితి ముగిసింది. ఇదిలా ఉండగా ఈ నెల 25న నిజామాబాద్ నగరపాలక సంస్థ, ఇతర మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగియనుంది. ఇక వచ్చే ఫిబ్రవరిలో సహకార సంఘాల పాలకవర్గాల కాలపరిమితి ముగియనుంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసి ఏడాది దాటిపోయింది. గత మే నెలలో లోక్‌సభ ఎన్నికలు సైతం ముగిశాయి. ప్రస్తుత ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు వరుసగా నిర్వహించాల్సిన ఆవశ్యకత నెలకొంది. ఈ ఎన్నికల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు, సీనియర్ కార్యకర్తలు, యువ నాయకులు, కార్యకర్తలు తమ ప్లాట్‌ఫాంను తయారు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. కొందరు ప్రథమ శ్రేణి నాయకులు జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్, మేయర్, మున్సిపల్ చైర్మన్, డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల పదవుల కోసం రేసులో ఉన్నారు.

రిజర్వేషన్ల కేటాయింపుపై..

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కేటాయింపు జరుగనుంది. ఈ నేపథ్యంలో జెడ్పీ చైర్మన్, మేయర్, మున్సిపల్ చైర్మన్ పదవులు ఆశించే నాయకులు తాము పోటీ చేయాలనుకుంటున్న మండలాలు, డివిజన్ల రిజర్వేషన్లు ఏవిధంగా వస్తాయో, చైర్మన్, మేయర్ పీఠాలు సైతం ఏ కేటగిరీకి వస్తాయో నని టెన్షన్ పడుతున్నారు.

అదేవిధంగా మండల ప్రజాపరిషత్ చైర్మన్ స్థానాలపై కన్నేసిన నాయకులు సైతం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. వీటితో పాటు గ్రామపంచాయతీ ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు ఉత్సాహంతో ఉన్న యువ నాయకత్వం ఎదురు చూస్తోంది. రిజర్వేషన్ల మేరకు ఏవిధంగా ముందుకెళ్లాలని లెక్కలు వేసుకుంటున్నారు. రిజర్వేషన్ల కారణంగా స్థానిక సంస్థల్లో అవకాశాలు రాకపోతే సహకార సంఘాల ఎన్నికల్లో సైతం బరిలోకి దిగేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

కొత్త ఏడాదిలో కొత్తగా ఉండాలని..

- కిటకిటలాడిన ఆలయాలు
- ప్రత్యేక పూజలు.. అర్చనలు



నీలకంఠేశ్వరాలయం ఆవరణలో భక్తుల సందడి

నిజామాబాద్ రూరల్: కోటి ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగిడిన ప్రజలు అంతా మంచే జరగాలని కోరుతూ ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు అర్చనలు చేయించారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వర, శంభులింగేశ్వర, ఉత్తర తిరుమల, అయ్యప్ప, తేనె సాయిబాబా, శుభం కరోతి గణపతి, సిద్ధివినాయక, మహాగణపతి ఆలయాలతో పాటు జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శనం కోసం బారులు తీరారు. నూతన ఏడాదికి స్వాగతం పలుకుతు ఇళ్ల ముందు రంగవల్లులు వేశారు.

రెండు రోజులు.. రూ.25 కోట్లు

- న్యూఇయర్ జోష్
- జోరుగా మద్యం విక్రయాలు
- మటన్, చికెన్, చేపలు తదితర వ్యాపారాలు రూ.5 కోట్లు
- నగరంలో 37 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

నాన్‌వెజ్ అమ్మకాలు

జిల్లాలో డిసెంబర్ 31 దావత్ కోసం మటన్, చికెన్, చేపలు పెద్ద మొత్తంలో కొనుగోలు చేశారు. న్యూ ఇయర్ వేడుకల్లో నాన్‌వెజ్‌తోపాటు ఇతర వాటికి జిల్లా ప్రజలు రూ.5 కోట్ల నుంచి రూ.6కోట్ల వరకు వెచ్చించినట్లు అంచనా.

ఖలీల్‌వాడి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లాలో మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. డిసెంబర్ 30, 31 రెండు రోజుల్లో మద్యం ప్రియులు తెగతాగేశారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువగా మద్యం విక్రయాలు సాగినట్లు ఎక్సైజ్ వర్గాల ద్వారా తెలిసింది. జిల్లాలో 102 వైన్స్‌లు, 17 బార్‌లు ఉండగా, సోమ, మంగళవారాల్లో మద్యం విక్రయాల ద్వారా ఎక్సైజ్‌కు రూ.25.10 కోట్ల ఆదాయం సమకూరింది. డిసెంబర్ 31న వైన్ షాపులు రాత్రి 12గంటల వరకు, బార్‌లు అర్ధరాత్రి ఒంటి గంట వరకు తెరిచి ఉంచేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. 30న లిక్కర్ 11వేల కేసులు, బీర్లు 5,500 కేసులు అమ్ముడుపోగా, రూ.11కోట్ల ఆదాయం వచ్చింది. డిసెంబర్ 31 మంగళవారం రావడం ఎక్సైజ్ శాఖకు కలిసి వచ్చింది. 7,500 కేస్‌ల బీర్లు, 14వేల కేస్‌ల లిక్కర్ అమ్ముడుపోగా రూ.14.10 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. గతేడాది ఎక్సైజ్ శాఖకు రూ.9.20 కోట్ల ఆదాయం సమకూరగా, గతేడాదితో పోలిస్తే రూ.4.90 కోట్ల ఆదాయం ఎక్కువగా వచ్చింది.

వాహనాల తనిఖీ

నగరంలో 20 బృందాలతో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మంగళవారం రాత్రి 8 నుంచి అర్ధరాత్రి వరకు 37 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు.

విషాహారంతో 50 కోళ్లు మృతి

- డొంకేశ్వర్ మండలం గంగాసముందర్‌లో విష ప్రయోగం



విషాహారం తిని మృతి చెందిన నాటు కోళ్లు, మేకపిల్లను పరిశీలిస్తున్న గ్రామస్తులు



విషం కలిపిన బియ్యం

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు నాటు కోళ్లపై విష ప్రయోగం చేశారు. విషం కలిపిన బియ్యం తిని 50 పైగా కోళ్లు, ఒక మేక మృతి చెందాయి. మోతె చిన్న సాయన్న, చాకలి రాజన్నలకు చెందిన కోళ్లు భారీ సంఖ్యతో మరణించాయి. గొల్ల సాయిలుకు చెందిన ఒక మేక పిల్ల కూడా చనిపోయింది. కావాలనే కోళ్లపై విష ప్రయోగం చేశారని కోళ్ల పెంపకం దార్లు ఆరోపిస్తున్నారు. గతంలో కూడా ఇలాగే చేశారని, వారిని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. సుమారు రూ.50వేల నష్టం జరిగిందని వాపోయారు. కోళ్లు, మేకపిల్ల మృతి చెందిన ఘటనపై మండల పశువైద్య అధికారి శ్రీకాంత్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం గ్రామానికి వచ్చి చనిపోయిన కోళ్లను పరిశీలించి అవసరమైతే పరీక్ష చేసేందుకు ల్యాబ్‌కు పంపుతామని అధికారి తెలిపారు.

పసుపు ధరపై ఆశలు

- పక్షం రోజుల్లో ప్రారంభం కానున్న పంట తవ్వకం
- 22వేల ఎకరాల విస్తీర్ణంలో సాగు
- సాంగ్లి మార్కెట్‌లో ప్రారంభమైన పాత పసుపు విక్రయాలు
- క్వింటాల్‌కు రూ.16వేలు లభిస్తున్న ధర



డొంకేశ్వర్(ఆర్మూర్): పసుపు పంటకు గతేడాది మంచి ధర లభించడంతో రైతులు ఈ ఏడాది ఎక్కువ విస్తీరణంలో పంట సాగు చేశారు. పదేళ్ల తరువాత గత సీజన్‌లో క్వింటాల్ పసుపు ధర రూ.20వేల మార్క్‌ను తాకడంతో ఈసారి కూడా అదే ధర వస్తుందనే నమ్మకంతో రైతులు ఉన్నారు. మహారాష్ట్రలోని సాంగ్లీ మార్కెట్‌లో పంట విక్రయాలు మొదలయ్యాయి. రైతులు నిల్వచేసి ఉంచిన పాత పసుపును అక్కడికి తీసుకెళ్లి విక్రయిస్తుండగా, క్వింటాల్ ధర రూ.16వేలు పలుకుతోంది. నిజామాబాద్ మార్కెట్‌లో రూ.14వేల వరకు చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో సాగు చేసిన పసుపు చేతికి వచ్చే దశకు చేరుకుంది. కొన్ని చోట్ల ఆకు కోతలు కోస్తున్నారు. పంట కోసేందుకు ఇప్పటికే మహారాష్ట్ర నుంచి కూలీలు జిల్లాకు వచ్చారు. గ్రూపులుగా ఏర్పడి రైతులతో పనులు కుదుర్చుకుంటున్నారు. మరో పక్షం రోజుల్లో పంట వెలికితీత పనులు ప్రారంభించనున్నారు. పసుపును ఉడకబెట్టే యంత్రాలను కూడా సిద్ధం చేస్తున్నారు. పంట పూర్తిగా చేతికి వచ్చే వరకు ధర నిలకడగా ఉండాలని రైతులు ఆశిస్తున్నారు. కొత్త పసుపు మార్కెట్‌లోకి వస్తే వ్యాపారులు ఎంత ధరకు కొనుగోలు చేస్తారో వేచి చూడాలి. ఈ సీజన్‌లో క్వింటాల్‌కు నాణ్యతను బట్టి రూ.14వేల నుంచి రూ.18వేల వరకు ధర వచ్చే అవకాశం ఉన్నట్లు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు.

పెరిగిన సాగు

గత కొన్నేళ్లపాటు పసుపు పంటకు ఆశించిన ధర రాకపోవడంతో జిల్లా రైతులు పంట సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తూ వచ్చారు. గతేడాది పసుపునకు డిమాండ్ ఏర్పడి మంచి ధర దక్కడంతో రైతులు మళ్లీ పసుపు సాగు విస్తీర్ణాన్ని పెంచారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా 17వేల ఎకరాల్లో పంట సాగు చేయగా, ఈ ఏడాది 22వేల ఎకరాల్లో సాగు చేశారు. గతేడాదితో పోలిస్తే ఐదువేల ఎకరాల సాగు విస్తీర్ణం పెరిగింది. పసుపు సాగును పూర్తిగా మానుకున్న రైతులు మళ్లీ సాగులోకి దిగారు. ఈ ఏడాది సాగు చేసిన పసుపునకు తెగుళ్లు, చీడపీడలు పెద్దగా ఆశించలేదు. వర్షాలతో ఇబ్బంది కలగకపోవడంతో దిగుబడి బాగానే ఉంటుందనే ఆశతో రైతులున్నారు. సాధారణంగా ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. పంట ఆరోగ్యంగా ఉంటే 30 క్వింటాళ్ల వరకు కూడా వస్తుందని రైతులు చెబుతున్నారు.

సాంగ్లీ మార్కెట్‌లో విక్రయించా..



గతేడాది సాగు చేసి నిల్వ ఉంచిన 130 క్వింటాళ్ల పసుపును ఇటీవల సాంగ్లీ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించా. క్వింటాల్‌కు రూ.16వేల ధర పలికింది. ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో పంట సాగు చేశా. మరికొన్ని రోజుల్లో పంట చేతికొస్తుంది. సీజన్ ముగిసే వరకు ధర ఇలాగే ఉంటే బాగుంటుంది. – గోక భోజారెడ్డి, డొంకేశ్వర్

స్వయంకృషితో సాగునీరు..

- ముసలమ్మ చెరువు తూముకు స్వయంగా మరమ్మతులు చేయించిన వీడీసీ
- ఆయకట్టుకు నీటి విడుదలలో తొలిగిన ఇబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



విశాఖపట్నం నుంచి వచ్చిన కార్మికునితో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు



తూము మరమ్మతుల తరువాత పంట పొలాలకు విడుదలవుతున్న నీరు

మోర్తాడ్: చెరువు తూము మరమ్మతులకు నిధుల విడుదలలో ప్రభుత్వం నుంచి స్పందన లేదు. దీంతో గ్రామాభివృద్ధి కమిటీ స్వయంగా నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించింది. ఆయకట్టు నీటి విడుదలకు ఇబ్బందులు తొలగిపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మోర్తాడ్ ముసలమ్మ చెరువులో నీరు సమృద్ధిగా ఉన్నా తూము సరిగా లేకపోవడంతో పంటలకు సాగునీటిని అందించే పరిస్థితి లేదు. యాసంగి పంటలను గట్టెక్కించాలంటే తూముకు మరమ్మతులు చేయించాల్సి ఉంది. గతంలో రూ.3.50 కోట్లు ఖర్చు చేసినా తూముకు సరిగా మరమ్మతులు కాలేదు. దీంతో సాగునీరు విడుదల చేసే అవకాశం లేదు. మళ్లీ మరమ్మతులకు నిధులు విడుదల చేయడానికి ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో గ్రామాభివృద్ధి కమిటీ సొంతంగానే నిధులను వెచ్చించింది. రూ.1 లక్ష ఖర్చు చేసి తూమ్‌కు మరమ్మతులు చేయించడంతో సాగునీటి సమస్య పరిష్కారమైంది. స్థానికంగా ఉన్న గజఈతగాళ్లతో మరమ్మతులకు ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. విశాఖపట్నంలో తూములకు మరమ్మతులు చేసే కార్మికులు ఉండటంతో వారిని ఇటీవల రప్పించిన గ్రామాభివృద్ధి కమిటీ సాగునీటి విడుదలకు చర్యలు తీసుకుంది. గ్రామాభివృద్ధి కమిటీ యాసంగి నీటి విడుదలకు చేసిన కృషిని స్థానిక రైతులు అభినందిస్తున్నారు. దాదాపు వెయ్యి ఎకరాలకు సాగునీరు అందనుందని రైతులు చెబుతున్నారు.

గతంలో మేమే చేయించాం..



గతంలో తూము మరమ్మతులకు ప్రభుత్వం స్పందించలేదు. రైతులందరం కలిసి ఎకరానికి రూ.2 వేల చొప్పున జమ చేసి తూముకు మరమ్మతులు చేయించాం. మళ్లీ తూమ్ మూసుకు పోవడంతో వీడీసీ స్పందించడం విశేషం. – పుప్పాల రాజు, రైతు, మోర్తాడ్

సాగునీటి సమస్య తీరిపోయింది..



యాసంగి పంటలకు సాగునీరు ఎలా అనే సందేహం ఉండేది. గ్రామాభివృద్ధి కమిటీ స్పందించి తూముకు మరమ్మతులు చేయించడంతో సాగునీటి సమస్య తీరిపోయింది. అధికారులు స్పందించి మరోసారి సమస్య రాకుండా చూడాలి – కొమిరె శ్రీధర్, రైతు, మోర్తాడ్

వీడీసీకి రైతులు రుణపడి ఉంటారు



ముసలమ్మ చెరువు మరమ్మతుల విషయంలో గ్రామాభివృద్ధి కమిటీ చొరవ తీసుకోవడంతో ప్రధాన సమస్య పరిష్కారమైంది. వీడీసీకి రైతులు రుణపడి ఉంటారు. సాగునీరు అందుతుండటంతో పంటలకు ఢోకా లేదు. – కుమ్మరి నరేష్, రైతు, మోర్తాడ్

రైతుల కోసమే కష్టపడ్డాం..



రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండవద్దని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కష్టపడి తూమ్‌కు మరమ్మతులు చేయించాం. గతంలో జరిగిన పనులు నాణ్యతగా లేకపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. – జక్కం అశోక్, వీడీసీ చైర్మన్, మోర్తాడ్

ఇంటర్ విద్యార్థులకు మెడిటేషన్

- పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు..
- ప్రతి జూనియర్ కళాశాలలో యోగా ట్రైనర్‌తో శిక్షణ
- ఇంటర్ బోర్డు నిర్ణయంతో జిల్లాలో అమలవుతున్న యోగా తరగతులు



మోర్తాడ్‌లో విద్యార్థులకు మెడిటేషన్ తరగతులు నిర్వహిస్తున్న యోగా ట్రైనర్

మోర్తాడ్: ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థుల కోసం ప్రభుత్వం మెడిటేషన్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. పరీక్షల సమయంలో ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యోగా ట్రైనర్లతో విద్యార్థులకు మెడిటేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఉన్న 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఒక్కో కళాశాలలో మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటర్ బోర్డు తీసుకున్న నిర్ణయం మేరకు హైదరాబాద్ నుంచి యోగా శిక్షకులు వచ్చి కళాశాలల్లో మెడిటేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు.

గతంలో ఇంటర్ ఫలితాల వెల్లడి అనంతరం ఫెయిల్ అయినవారిలో కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్న విషయం విదితమే. అలాంటి ఘటనలు పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో విద్యార్థులను మానసికంగా సిద్ధం చేసేందుకు ఇంటర్ విద్యాధికారులు సరికొత్త నిర్ణయం తీసుకోవడం విశేషం. ప్రభుత్వం నిర్ణయంపై హర్షం వ్యక్తమవుతోంది.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే..

విద్యార్థుల ప్రయోజనాలను, వారి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మానసిక ఒత్తిడికి గురికాకుండా ఉండటానికి ఇంటర్ బోర్డు మెడిటేషన్ తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ శిక్షణ తరగతులపై జిల్లా కేంద్రంలో ప్రత్యేక సమావేశాన్ని కూడా నిర్వహించనున్నాం. – రవికుమార్, జిల్లా ఇంటర్ విద్యాధికారి

క్లుప్తంగా

బోధన్‌ ఎమ్మెల్యేకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



సుభాష్‌నగర్‌: మాజీమంత్రి, బోధన్‌ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ఉమ్మడి నిజామాబాద్‌ డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేష్‌రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఉమ్మడి జిల్లాలో రుణ మాఫీ, పంట, దీర్ఘకాలిక రుణాలు, తదితర అంశాలపై చర్చించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంకు రూ.2వేల కోట్ల వ్యాపారాన్ని అధిగమించిన విషయాన్ని బ్యాంకు చైర్మన్‌ రమేష్‌రెడ్డి సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. బ్యాంకుకు పూర్వవైభవం తీసుకురావాలని, ఎన్‌పీఏ విషయంలో కఠినంగా వ్యవహరించాలని సుదర్శన్‌రెడ్డి ఆయనకు సూచించారు.

రాష్ట్ర స్థాయి అర్చరీ పోటీల్లో బంగారు పతకం



సిరికొండ: సీఎం కప్‌ రాష్ట్రస్థాయి అర్చరీ పోటీల్లో తాళ్లరామడుగు గ్రామానికి చెందిన బాకారం రాహుల్‌ బంగారు పతకం సాధించాడు. ఖమ్మంలో బుధవారం జరిగిన పోటీల్లో అదే జిల్లాకు చెందిన శివసాయిపై రాహుల్‌ విజయం సాధించాడు. అర్చరీలో రాహుల్‌ బంగారు పతకం సాధించడం పట్ల మండలంలో క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

రెజ్లింగ్‌ పోటీల్లో..



మోపాల్‌: హన్మకొండ జిల్లాలో జరుగుతున్న సీఎం కప్‌ రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌ 46 కేజీల విభాగంలో మండలంలోని మంచిప్పకు చెందిన బాదావత్‌ రోజా బంగారు పతకం సాధించింది. రోజాను జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిందని జిల్లా రెజ్లింగ్‌ కోచ్‌ దేవేందర్‌ తెలిపారు. రోజా బంగారు పతకం సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

విరగబూసిన మామిడి



సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు గ్రామ చౌరస్తా వద్ద ఉన్న మామిడి చెట్టు విరగబూసింది. కామారెడ్డి–భీంగల్‌ ప్రధాన రహదారి పక్కనే ఈ చెట్టు ఉంది. విరగబూసిన మామిడి చెట్టు రోడ్డు వెంబడి వెళ్లే ప్రయాణికులను కనువిందు చేస్తోంది.

విద్యాశాఖలో కదలని ఫైళ్లు!

- డీఈవో, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ మధ్య వివాదం
- రెండు నెలలుగా ఆగిపోయిన ఫైళ్లు



నిజామాబాద్‌ అర్బన్‌: జిల్లా విద్యాశాఖలో రెండు నెలలుగా ఫైళ్లు కదలడం లేదు. నూతనంగా జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్న అశోక్‌, విద్యాశాఖలో అసిస్టెంట్‌ డైరెక్టర్‌గా కొనసాగుతున్న నాగజ్యోతి మధ్య ఈ ఫైళ్ల వివాదం నెలకొంది. వివిధ విభాగాలకు సంబంధించిన ఫైళ్లను క్లియర్‌ చేయాల్సిన సందర్భంలో ఇద్దరు కూడా సంతకాలు చేయకపోవడంతో అవి పెండింగ్‌లో ఉంటున్నాయి. దీంతో పరిపాలన విభాగంలో సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేగాక ప్రైవేట్‌ పాఠశాలల ఫైల్‌ నిర్వహణ సైతం అలాగే నిలిచిపోయింది.

మీరంటే.. మీరని..

డీఈవో అశోక్‌ నవంబర్‌ 5న బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కార్యాలయానికి సంబంధించి పరిపాలన విభాగం, ప్రైవేట్‌ పాఠశాలలు, సర్వీస్‌ ఫైళ్లకు సంబంధించి పూర్తిస్థాయి అవగాహన వచ్చిన తర్వాతే పరిశీలిస్తానని ఆలోచనలో డీఈవో ఉన్నారు. అలాగే పరిపాలనలో భాగంగా అసిస్టెంట్‌ డైరెక్టర్‌ ముందుగా సంతకం చేసి తీసుకువస్తేనే తాను సంతకం చేస్తానని అంటున్నారు. మరోవైపు అసిస్టెంట్‌ డైరెక్టర్‌ నాగజ్యోతి ప్రైవేట్‌ పాఠశాలల గుర్తింపు, రెన్యువల్‌, సర్వీస్‌కు సంబంధించి ఫైళ్లపై సంతకాలు చేయడం లేదు. దీంతో డీఈవో కూడా వాటిపై సంతకాలు చేయడం లేదు. ''మీరు సంతకం చేస్తేనే, నేను సంతకం చేస్తానంటూ'' ఇద్దరు అంటున్నారు. వీరిద్దరి మధ్య కొనసాగుతున్న వివాదంతో ఫైళ్లు నిలిచిపోయాయి. ఇందులో ఇప్పటికే ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి గుర్తింపు విషయంలో 18 ఫైళ్లు నిలిచిపోయాయి. మరో 12 రెన్యువల్‌కు సంబంధించినవి ఉన్నాయి. ఇంతేకాక సర్వీస్‌ మ్యాటర్‌కు సంబంధించిన ఫైళ్లు అలాగే ఉండిపోయాయి. ఉద్యోగులకు సంబంధించిన సర్వీస్‌ ఫైళ్లు ఎప్పటికప్పుడు క్లియర్‌ చేయాల్సి ఉండగా నెలరోజులుగా పెండింగ్లో ఉన్నాయి. దీంతో టీచర్లు, ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో పరీక్షలు ఏర్పాట్లకు సంబంధించిన ఫైళ్లు కూడా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి.

సెలవుల్లో ఉన్న ఉద్యోగికి వేతనం

విద్యాశాఖ కార్యాలయంలోని ఓ సీనియర్‌ అసిస్టెంట్‌ మూడు నెలలు సెలవుల్లో ఉన్నా కూడా జీతం మంజూరు చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఓ అధికారి ఇలా సెలవులో ఉన్న వేతనాలు మంజూరు చేయడం జరిగింది. దీనిపై విచారణ చేస్తామన్నా.. ఇప్పటికీ ముందడుగు పడటం లేదు. ప్రస్తుతం వివిధ విభాగాలతో సంబంధించిన ఫైళ్లను క్లియర్‌ చేయడంలో నువ్వా నేనా అనుకునే అధికారులు ఓ సీనియర్‌ అసిస్టెంట్‌కు ఏకంగా మూడు నెలల జీతాన్ని ఎలా మంజూరు చేశారని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆన్‌లైన్‌ చేయాల్సి ఉంది

కొన్ని ఫైళ్లను మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఆన్‌లైన్‌ చేయాల్సి ఉంది. అందుకే నిలిచిపోయాయి. వీటిని క్లియర్‌ చేయిస్తాను. కార్యాలయంలో పెండింగ్‌ ఫైళ్లను క్లియర్‌ చేయాలని ఏడీని ఆదేశించాం.

– అశోక్‌, డీఈవో

'వరద' పోతోంది!

- ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదల
- కేటాయింపుల్లో ఆ కాలువకు జీరో
- అయినా నీటిని వదులుతున్న అధికారులు
- ఇదేం లెక్క అంటున్న ఆయకట్టు రైతులు



వరద కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీరు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి మిగులు జలాలను సద్వినియోగం చేసుకోవడానికి నిర్మించిన వరద కాలువ ద్వారా ప్రాజెక్ట్‌ అధికారులు నీటి విడుదలను ప్రారంభించారు. ప్రాజెక్ట్‌ నుంచి ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌లో వరద కాలువ ద్వారా నీటి విడుదల కోసం ఎలాంటి కేటాయింపులు జరగలేదు. అయినా మంగళవారం నుంచి నీటి విడుదలను ప్రారంభించారు. గతేడాది కూడా ఇలానే చేపట్టడంతో ప్రాజెక్ట్‌ ఆయకట్టుకు చివరలో నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ప్రస్తుత సంవత్సరం యాసంగి సీజన్‌కు ప్రాజెక్ట్‌ నుంచి కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాలకు కలిపి 63.8 టీఎంసీల నీటిని కేటాయించారు. అందులో వరద కాలువకు ఎలాంటి కేటాయింపులు లేవు. ప్రస్తుతం వరద కాలువకు విడుదల చేస్తున్న నీటిని ఏ లెక్కల్లో చూపుతురాని ఆయకట్టు రైతులు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన నీటి విడుదల

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి వరద కాలువ ద్వారా నీటి విడుదలను బుధవారం ప్రాజెక్ట్‌ అధికారులు పెంచారు. కాలువ ద్వారా 5000 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. కాకతీయ కాలువ ద్వారా 5500 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 700 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ ద్వారా 200 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్‌ లిఫ్ట్‌ ద్వారా 487 క్యూసెక్కులు, ఎత్తిపోతల పథకల ద్వారా 312 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 428 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 1089.50(75 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

- డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్‌ కమిషనర్‌ దుర్గా ప్రమీల

మోపాల్‌: రోడ్డు భద్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్‌ కమిషనర్‌ దుర్గా ప్రమీల సూచించారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో మోపాల్‌ బీసీ సంక్షేమ బాలుర వసతిగృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం దుర్గాప్రమీల మాట్లాడుతూ ట్రాఫిక్‌ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. హెల్మెట్‌ ధరించాలని, సెల్‌ఫోన్‌ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. రోడ్డు భద్రతపై తల్లిదండ్రులకు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి ఉమా మహేశ్వర్‌, మోటార్‌ వెహికల్‌ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌, రాహుల్‌, శ్రీనివాస్‌, ఐరాడ్‌ మేనేజర్‌ వర్షా నిహంత్‌, వసతిగృహ సంక్షేమాధికారి అశోక్‌ పాల్గొన్నారు.

కొత్త పింఛన్‌లకు కలగని మోక్షం

- గతంలో దరఖాస్తులు స్వీకరించినా మంజూరులో అలసత్వం
- నిరీక్షిస్తున్న వేలాది మంది అర్హులు



రమ్య, సుంకెట్‌



మోర్తాడ్‌(బాల్కొండ): మోర్తాడ్‌ మండలం సుంకెట్‌కు చెందిన రమ్య భర్త గంగాధర్‌ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మరణించాడు. దీంతో కూతురు, కొడుకును సాకేందుకు రమ్య వ్యవసాయ పనులకు కూలీగా వెళ్తోంది. గంగాధర్‌ గతంలో ఉపాధి కోసం బహ్రెయిన్‌కు వెళ్లినా అక్కడ అతడు పక్షవాతం పడి ఇంటికి తిరిగివచ్చి అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి రమ్య తన కుటుంబాన్ని గట్టెక్కించేందుకు ఎన్నో కష్టాలు పడుతోంది. తనకు వితంతు పింఛన్‌ మంజూరైతే ఎంతో ఆసరాగా ఉంటుందని రమ్య దరఖాస్తును అధికారులకు అందజేసింది. కొత్త పింఛన్లు మంజూరుకాకపోవడంతో రమ్య పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇది ఒక్క రమ్యకు ఎదురవుతున్న సమస్య కాదు. ఎంతో మంది అర్హులకు పింఛన్లు మంజూరు కాకపోవడంతో ప్రభుత్వం ఇచ్చే ఆసరా కోసం కళ్లు కాయలు కాచేలా నిరీక్షిస్తూనే ఉన్నారు. 2022 సెప్టెంబర్‌లో అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం కొత్త పింఛన్లు మంజూరు చేయగా ఆ తరువాత కొత్త పింఛన్‌ల ఊసే లేదు.

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్‌ల సొమ్మును రెట్టింపు చేస్తామని కాంగ్రెస్‌ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొంది. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా పింఛన్‌ల పెంపుదిశగా అడుగులు పడకపోవడంతో లబ్ధిదారులు నిరాశకు గురవుతున్నారు. మరో వైపు నూతన పింఛన్‌ల గురించి మాట్లాడే వారు లేకుండాపోయారు. వృద్ధాప్య పింఛన్‌ అందుకుంటున్న వారిలో భార్య లేదా భర్త ఎవరో ఒకరు చనిపోతే ఆ పింఛన్‌ మాత్రం బతికి ఉన్న వారికి బదిలీ చేయడం తప్ప కొత్త పింఛన్‌లు మంజూరు చేయడం లేదు. జిల్లాలో ఇప్పటి వరకు 2,69,546 మందికి మాత్రమే పింఛన్‌లు అందుతున్నాయి. కొత్త పింఛన్‌ల కోసం వేలాది మంది దరఖాస్తు చేసుకోగా కొన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కమీషనర్‌ కార్యాలయంలో, మరికొన్ని ఎంపీడీవో లాగిన్‌లో మరికొన్ని సెర్ప్‌ జిల్లా కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. ఆసరాకు సంబంధించిన వెబ్‌సైట్‌ మూసి ఉండటంతో కొత్త పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి తమ దరఖాస్తు ఎక్కడ ఇవ్వాలో అర్థం కావడం లేదు. ఒక వేళ గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌ కార్యాలయాల్లో అందించినా ఆన్‌లైన్‌ ప్రారంభిస్తేనే పింఛన్‌ దరఖాస్తుదారుల జాబితా రాష్ట్ర ప్రభుత్వానికి చేరుతుంది. ప్రభుత్వం స్పందించి తమకు పింఛన్‌లు మంజూరు చేయాలని అర్హులు కోరుతున్నారు.

జిల్లాలో అందుతున్న పింఛన్‌లు

వృద్ధాప్య	68,677
వితంతు	74,154
దివ్యాంగ	18,849
చేనేత	184
కల్లుగీత కార్మికులు	1,024
బీడీ కార్మికులు	95,453
ఒంటరి మహిళలు	10,185
బీడీ టేకేదార్‌	1,020
మొత్తం	2,69,546

ఆలయ భూమి కబ్జా!

- కాంగ్రెస్‌ నేతల హస్తం
- అధికారుల చుట్టూ తిరుగుతున్న బాధితులు



కబ్జాకు గురైన భూమిని చూపుతున్న యజమానులు(ఫైల్‌)

నిజామాబాద్‌ రూరల్‌: నిజామాబాద్‌ రూరల్‌ మండలం ఆకుల కొండూర్‌ గ్రామంలో గల నల్ల పోచమ్మ ఆలయ భూములు కబ్జాకు గురయ్యాయి. గ్రామానికి చెందిన మణెమ్మ కుటుంబ సభ్యులకు 199 సర్వే నంబర్‌లో 12 ఎకరాల 11 గుంటల భూమి ఉండేది. ఆ భూమిని ఇతరులకు విక్రయించారు. అందులోని 38 గుంటల భూమిని నల్లపోచమ్మ ఆలయం కోసం వదిలేశారు. అయితే రికార్డులలో మాత్రం వారి పేరు ఉండేది. కాగా ఆ భూమిని ప్రస్తుతం అధికార పార్టీలో ఉన్న నేతలు కబ్జా చేశారు. 2016 వరకు వారి పేరు మీద ఉన్న భూములు ప్రస్తుతం ఇతరుల పేర్ల మీదకు మారాయి. ఆలయ భూముల కబ్జాపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే కబ్జా విషయమై గ్రామస్తులు ఎన్నోసార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. కానీ ఇంతవరకు న్యాయం జరగలేదు.

పట్టించుకోని అధికారులు

కొండూర్‌లో 38 గుంటల భూమి కబ్జా విషయంపై అధికారులకు ఎన్ని సార్లు చెప్పిన ఫలితం లేకుండా పోతుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్‌ పార్టీకి చెందిన బడా నాయకులే కబ్జాలు చేశారని ఆరోపిస్తున్నారు. గతంలో అధికారులతో కుమ్మక్కై రికార్డులు తారుమారు చేసి, భూమి కబ్జా చేశారని వాపోతున్నారు.

చర్యలు తీసుకోవాలి

భూమి కబ్జా విషయమై అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. సమస్యను స్థానిక ఎమ్మెల్యే వద్దకు తీసుకెళ్లాం. స్థానికంగా సమస్య పరిష్కారం కాకుంటే రెవెన్యూ మంత్రిని, సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఉద్యమిస్తాం.

– అగ్గు భోజన్న, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు

బోధన్‌ ఎంఐఎం టౌన్‌ కమిటీ రద్దు

ఖలీల్‌వాడి: ఆలిండియా మజ్లిస్‌ ఇత్తెహద్‌ ముస్లమిన్‌ అధ్యక్షుడు, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఓవైసీ ఆదేశాల మేరకు బోధన్‌ ఎంఐఎం టౌన్‌ కమిటీని రద్దు చేసినట్లు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌ ఫయాజుద్దీన్‌ బుధవారం తెలిపారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఎంఐఎం ముహమ్మద్‌ షకీల్‌ అహ్మద్‌ ఫాజిల్‌, ప్రధాన కార్యదర్శి మహ్మద్‌ షాబాజ్‌ అహ్మద్‌తో కలిసి బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆలయన మాట్లాడారు. ఓవైసీ, మజ్లిస్‌ జిల్లా సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి, మలక్‌పేట్‌ ఎమ్మెల్యే అహ్మద్‌ బిన్‌ అబ్దుల్లా బిలాల సలహా మేరకు త్వరలో బోధన్‌ ఎంఐఎం బాడీ ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు బోధన్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు ప్రజల్లో ఉంటూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.

కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఊరుకోం



మాట్లాడుతున్న నుడా చైర్మన్‌ కేశ వేణు

నిజామాబాద్‌ సిటీ: కాంగ్రెస్‌ను విమర్శిస్తే ఇకపై ఊరుకోమని నుడా చైర్మన్‌ కేశ వేణు అన్నారు. నగరంలోని కాంగ్రెస్‌ భవన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్‌ను విమర్శించే ముందు జిల్లాకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. అధికారం పోయినా ఏడాదికి ఆమె జిల్లాకు వచ్చారన్నారు. కవిత లిక్కర్‌ స్కాం కేసులో బెయిల్‌పై ఉన్న విషయం గుర్తుంచుకోవాలని ఎద్దేవా చేశారు. జిల్లాకు చుట్టపు చూపుగా రావడం తప్ప ఆమె చేసిందేమీ లేదన్నారు. బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌ పార్టీపై అనవసర విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఎంపీగా రెండు సార్లు గెలిచిన అర్వింద్‌ కేంద్రం నుంచి నిధులు ఎందుకు తేవడం లేదన్నారు. మున్సిపల్‌ ఎన్నికల్లో మేయర్‌ పీఠం కాంగ్రెస్‌దేనన్నారు.

నగర అభివృద్ధికి రూ.60 కోట్లు

నూతన సంవత్సర కానుకగా రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్‌ నగర అభివృద్ధికి రూ.60 కోట్లు మంజూరు చేసిందని కేశ వేణు తెలిపారు. డివిజన్‌కు రూ.కోటి చొప్పున నిధులు కేటాయించాన్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం వీటిని వినియోగించాలని సూచించారు. అమృత్‌ పథకం కింద బల్దియాకు రూ.460 కోట్లు వచ్చాయన్నారు. నాయకులు మహ్మద్‌ ఖుద్దూస్‌, గడుగు రోహిత్‌, జావేద్‌ అక్రం, ఆరూన్‌ ఖాన్‌, పంచరెడ్డి సూరి, రాజ నరేందర్‌ గౌడ్‌, అపర్ణ తదితరులున్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు చోట్ల నలుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో బుధవారం నలుగురు మృతి చెందారు. చేపల వేటకు వెళ్లి ఒకరు, రోడ్డు ప్రమాదంలో మరొకరు చనిపోయారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ ఇద్దరు చికిత్స పొందుతూ మరణించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నిజాంసాగర్‌: చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి చెందిన ఘటన మహమ్మద్‌ నగర్‌ మండలం కోమలంచ గ్రామ శివారులోని మంజీర నదిలో చోటు చేసుకుంది. ఎస్సై శివకుమార్‌ కథనం ప్రకారం.. బాన్సువాడ మండలం తిర్మలాపూర్‌ గ్రామానికి చెందిన గుట్ట సాయిలు(35) చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం కొమలంచ శివారులోని మంజీర నదిలో చేపలు వేటాడుతుండగా తెప్పపై నీటిలో పడ్డాడు. సాయిలు రెండు కాళ్లకు వల చిక్కుకోవడంతో నీటమునిగి మృతి చెందాడు. మృతుడి సోదరుడు బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

అడవి పందులను ఢీకొని ఒకరు..

ఎల్లారెడ్డి: అడవి పందులను బైక్‌ ఢీకొని ఒకరు మృతి చెందారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామానికి చెందిన మైసాగౌడ్‌(52), పద్మా భార్యభర్తలు. వీరు బైక్‌పై వస్తుండగా గ్రామ శివారులో అడవి పందులను బైక్‌ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరిని ఆస్పత్రికి తరలిస్తుండగా మైసాగౌడ్‌ మృతి చెందాడు. పద్మ చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

నిజాంసాగర్‌: జుక్కల్‌ మండలం మధుర తండాకు చెందిన చావన్‌ హరియాన్‌ బాయి (56) నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై భువనేశ్వర్‌ తెలిపారు. తండాకు చెందిన చావన్‌ మోహన్‌ తన తల్లి హరియన్‌ బాయితో కలిసి బైక్‌పై వెళ్తుండగా గత నెల 26న శ్రీనగర్‌ సమీపంలోని కోళ్లఫారం వద్ద ఎదురుగా వచ్చిన బైక్‌ ఢీకొంది. గాయపడ్డ మోహన్‌, హరియాన్‌బాయిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలి భర్త నందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

మచ్చర్లకు చెందిన వ్యక్తి..

నవీపేట: మండలంలోని గాంధీనగర్‌ సమీపంలో గత నెల 27న జరిగిన ప్రమాదంలో గాయపడిన ఆలూర్‌ మండలం మచ్చర్ల గ్రామానికి చెందిన కమ్మరి కాంతారావు(49) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై వినయ్‌ తెలిపిన వివరాలు.. నవీపేట నుంచి నందిపేట వైపు ఆటోలో వెళ్తుండగా డ్రైవర్‌ అప్సర్‌ నిర్లక్ష్యంగా ఆటోను నడపడంతో కాంతారావు కిందపడ్డాడు. తీవ్ర గాయాలైన కాంతారావును చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

హత్య చేస్తారన్న భయంతో ఆత్మహత్య

నస్రుల్లాబాద్‌: హత్య చేస్తామని బెదిరించడంతో భయపడి ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని దుర్కి గ్రామానికి చెందిన సంతోష్‌ (23)ను అదే గ్రామా నికి చెందిన దుర్గం సూరి, అతని భార్య ఆమని, దుర్గం సంజీవ్‌ బెదిరించారు. దీంతో భయపడ్డ సంతోష్‌ డిసెంబర్‌ 18న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

జీవితంపై విరక్తితో ఒకరు..

నస్రుల్లాబాద్‌: మండలంలోని దుర్కి శివారులో గల పొలంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. బాన్సువాడ మండలం సోమేశ్వర్‌ గ్రామానికి చెందిన షేక్‌ గౌస్‌(45) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. గౌస్‌ భార్య పిల్లలను తీసుకుని 15 ఏళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. ఒంటరి తనంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన మంగళవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు.

మృతుడి సోదరుడు షాబోద్దీన్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లావణ్య పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్‌ పట్టివేత

నవీపేట: మండల కేంద్రంలో మంగళవారం రాత్రి ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై వినయ్‌ బుధవారం తెలిపారు. రెంజల్‌ మండలం బోర్గాం గ్రామానికి చెందిన నవీద్‌కు చెందిన టిప్పర్‌లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో పట్టుకున్నామన్నారు. వాహనాన్ని సీజ్‌ చేసి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు అప్పగించామన్నారు.

రావుట్లలో వడ్ల బస్తాల చోరీ

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో గంగారెడ్డి అనే వ్యక్తికి చెందిన 12 సంచుల వడ్లు చోరీ జరిగినట్లు ఎస్సై రామ్‌ బుధవారం తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. కేసులో డీబీ తండాకు చెందిన ఇద్దరు మైనర్లను నిందితులుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. కాగా వడ్ల సంచులను కొంత మంది కారులో తరలించి భీంగల్‌లోని ఒక రైస్‌ మిల్లులో విక్రయించినట్లు సీసీ పుటేజీ ద్వారా గుర్తించినట్లు బాధితుడు తెలిపారు.

నాలుగు డ్రంకన్‌ డ్రైవ్‌ కేసులు

మోపాల్‌: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంకన్‌ డ్రైవ్‌లో నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్‌ తెలిపారు.